తాగునీటి పైప్‌లైన్ల ప్రక్షాళన

- నరసాపురం పట్టణంలో రూ.61.81 కోట్లతో చేపట్టనున్న పనులు
- అదనంగా మరో 4 ఓహెచ్ఆర్‌ల నిర్మాణం
- త్వరలో టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- మున్సిపాలిటీలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్


నరసాపురంలోని మంచినీటి చెరువు


పంజా సెంటర్‌లో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో పాత తాగునీటి పైప్‌లైన్‌లను పూర్తిగా ఆధునికీకరించడంతో పాటు అదనంగా ఓహెచ్ఆర్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో తీసుకున్న నిర్ణయం అమలు కాబోతుంది. ఇందు కోసం మున్సిపాలిటీలో రూ.61.81 కోట్లతో చేపట్టనున్న స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌కు టెండర్ల ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి సాంకేతిక అనుమతులిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఈ ఏడాది ఫిబ్రవరిలో జీవో నెంబర్ 15ను విడుదల చేసింది. దీంతో టెండర్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రాజెక్ట్ మంజూరుతో దాదాపు 45 ఏళ్ల దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పట్టణంలో 70 ఎకరాల భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. ఈ చెరువులో ఎప్పుడూ 586 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులో ఉంటుంది. తాగునీటి సరఫరాకు మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. 60 వేల జనాభా ఉన్న పట్టణంలో 8,760 గృహ కుళాయి కనెక్షన్లు,120 పబ్లిక్ కుళాయిలు, 596 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి.

పైప్‌లైన్లు శిథిలమవ్వడమే సమస్య

తాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉన్నా కుళాయిల ద్వారా సంవృద్ధిగా ప్రజలకు అందించలేని పరిస్థితి మున్సిపాలిటీలో నెలకొంది. అయితే అసలు చిక్కంతా పైప్‌లైన్లు శిథిలమవ్వడం వల్లే వస్తోంది. పైప్‌లైన్లు బాగోలేకపోతే తక్కువ ప్రెషర్‌తో నీటిని వదులుతారు. దీంతో కుళాయిల ద్వారా నీళ్ళు సవ్యంగా రావు. ఒకవేళ ఎక్కువ ప్రెషర్‌తో నీటిని వదిలితే పైప్‌లైన్లు ఇంకా పెద్ద సంఖ్యలో లీకేజీలు ఏర్పడే పరిస్థితి ఉంది. పైప్‌లైన్‌ల లీకేజీలు కారణంగా రాయపేట, రుస్తుంబాద్, స్టేషన్‌పేట, చిన మామిడిపల్లి, వీవర్స్ కాలనీ, వైఎస్సార్ నగర్, నందమూరి కాలనీ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పొన్నపల్లి, మాధవాయిపాలెం, చినమామిడిపల్లి ఓఎన్జీసీ కాలనీ, జవదాలవారి పేట, లాకుపేట ప్రాంతాల్లో తాగునీటి కొరత ఉంది. ఇది దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్య. 1956లో మున్సిపాలిటీ ఏర్పడింది. 45 ఏళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్‌లను ఆధునికీకరించాలనే ఆలోచన గతంలో ప్రభుత్వాలు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో ఇప్పటికి తాగునీటి సరఫరా మెరుగుదలకు స్పెషల్ ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుంది.

ఇదీ స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ స్వరూపం

పట్టణంలో ప్రస్తుతం 3 ఓహెచ్ఆర్‌లు ఉన్నాయి. స్పెషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా మరో నాలుగు ఓహెచ్ఆర్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం 96 కిలోమీటర్లు మేర పైప్‌లైన్‌లు ఉన్నాయి. వీటిలో 40 కిలోమీటర్లు మేర పైప్‌లైన్‌లు పూర్వం ఎప్పుడో వేసినవే. వాటిని పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తారు. దీనికి తోడు కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్లు మేర శివారు ప్రాంతాలకు పైప్‌లైన్‌లు నిర్మించనున్నారు. నీటిశుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించబోతున్నారు.

ఇకపై ఇబ్బందులు ఉండవు



నరసాపురంలో భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. కానీ పైప్‌లైన్ల వల్లే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇకపై ఈ సమస్య ఉండదు. రూ॥61.81 కోట్లతో పట్టణంలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ చేపడుతున్నాం. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. చాలా ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌లు వేస్తారు. ఇక వేసవిలో కూడా నీటి ఇబ్బంది అనేది ఉండదు.

ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్

శాశ్వత అభివృద్ధి పనులు



నరసాపురం మున్సిపాలిటీలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో శాశ్వత అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూ.220 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్ట్ తీసుకొచ్చారు. అలాగే దీర్ఘకాల సమస్యగా ఉన్న తాగునీటి పైప్‌లైన్ల ఆధునికీకరణకు సిద్ధమయ్యారు. పైప్‌లైన్ల ప్రక్షాళన పట్టణవాసులకు ఎంతో అవసరం. గత ప్రభుత్వాలు ఇలాంటి పనులు చేసిన దాఖలాలు లేవు.

తిర్రే బాబూరావు, రిటైర్డ్ శానిటరీ సూపర్‌వైజర్

క్లుప్తంగా

నేడు చీఫ్ విప్ పర్యటన

మొగల్తూరు: నరసాపురం పట్టణం నాలుగో వార్డులో శనివారం నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొననున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. అదే వార్డులో రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు.

పార్వతి మాతకు మంగళ సూత్రాలు బహూకరణ


మంగళ సూత్రాలు బహుకరిస్తున్న దాతలు

పెనుగొండ: శ్రావణ మాసం సందర్భంగా ప్రసిద్ధి ఆచంటలోని ఆచంటేశ్వరుని ఆలయంలో పార్వతి మాతకు రూ.1.10 లక్షలు విలువైన మంగళ సూత్రాలను ఆచంటకు చెందిన గద్దే శ్రీనివాస్, అనంతలక్ష్మి దంపతులు, కుమార్తె యూఎస్ఏకు చెందిన రమాదేవి, శ్రీధర్, ఈశ్వర్‌లు బహుకరించారు. శుక్రవారం సూత్రాలతో పాటు అమ్మవారికి అలంకరించడానికి వస్తువులను అర్చకుడు సన్నిధిరాజు కొండయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి రామచంద్రరావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం


మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

మొగల్తూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏపీవీ అప్పారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది నరసాపురం గోదావరి గట్టు పొడవునా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకం ఎంతో దోహదపడ్తుందన్నారు. గోదావరి ఏటిగట్ల పటిష్టతకు చెట్లను పంచాలని, మొక్కలు పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కనకరావు, బెజవాడ వెంకటరత్నం, ఫిజికల్ డైరెక్టర్ జి.సునీల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో దళితులకు అధిక ప్రాధాన్యం


గోపిని సత్కరిస్తున్న గుమ్మాపు సూర్యవరప్రసాదరావు, నాయకులు

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గంలో దళితులకు నామినేటెడ్ పదవులు, ఇతర పార్టీ పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇస్తానని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. యాళ్లవాని గరువు పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాలమహానాడు (పీవీ రావు) రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాదరావు, దళిత నాయకులు గోపిని కలిసి శాలువాతో సత్కరించి, అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడానికి పూర్తిగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొర్రపాటి వీరాస్వామి, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గంలో ఇద్దరికి అవకాశం


సత్తి వెంకటరెడ్డి


దొంగా దుర్గాప్రసాద్

పెనుమంట్ర: మండలంలోని కొయ్యేటిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు దొంగా దుర్గాప్రసాద్, నెగ్గిపూడికి చెందిన సత్తి వెంకటరెడ్డిలకు పార్టీ జిల్లా కార్యవర్గంలో చోటు దక్కింది. ఈ సందర్భంగా శుక్రవారం ఇరువురూ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజును కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తమ వంతు కృషిచేస్తామని చెప్పారు.

నేడు పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుమంట్ర: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.పూర్ణబాబ్జి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు


మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న జిల్లా ఉపాధ్యక్షునిగా నియమితులైన తన్నేటి జగ్జీవన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, జిల్లా కార్యదర్శి దిద్దే శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర నాగబాబు, సత్తి వెంకటరెడ్డి, దుర్గాప్రసాద్

పెనుగొండ: వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. నూతన కార్యవర్గంలో పెనుగొండ మండలం నుంచి పార్టీ నాయకులకు చోటు దక్కింది. వారంతా శుక్రవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి రంగరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్‌ను సిద్ధం చేయండి


వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న గోపి

పాలకొల్లు అర్బన్: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.15 కోట్లతో నిర్మించిన ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సూచించారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్, ఎంపీ మిథున్‌రెడ్డి చేతుల మీదుగా పట్టణంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు. స్థానిక 27వ వార్డు ఛాంబర్స్ కళాశాల వద్ద మున్సిపల్ సాధారణ నిధులు రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, క్షత్రియ సంక్షేమ పరిషత్ వద్ద సీసీ డ్రెయిన్ పనులను గోపి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కుళాయి చెరువు గట్టును పరిశీలించారు. చెరువు చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించాలని, అలాగే వాటర్ వర్క్స్ వద్ద పబ్లిక్ కుళాయిలు ప్రాంతంలో విద్యుత్ బల్బ్ ఏర్పాటు చేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డు రిజర్వాయర్ పనులు పూర్తయిన నేపథ్యంలో ఆ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. గోపి వెంట వైఎస్సార్ సీపీ దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు యడ్ల తాతాజీ, పట్టణాధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్లు ఎం.మైఖేల్‌రాజు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోపిని కలిసిన రవీంద్ర ప్రసాద్

పోడూరు: వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కమిటీ సెక్రటరీగా నియమితులైన వేడంగిపాలెం గ్రామానికి చెందిన కొండేటి రవీంద్ర ప్రసాద్ శుక్రవారం పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపి, పార్టీ నాయకులు ఆయనను అభినందించారు. దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. గోపి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


బియ్యం కార్డులను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ జక్కంశెట్టి భాగ్యలక్ష్మి

యలమంచిలి: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ కొంతేరు గ్రామ కమిటీ అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ జక్కంశెట్టి భాగ్యలక్ష్మి తెలిపారు. జగనన్న సురక్ష పథకం కింద దరఖాస్తు చేసుకున్న 21 మందికి బియ్యం కార్డులను శుక్రవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ లంచాలు, సిఫార్సులకు తావులేకుండా ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలంతా మరొకసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ గౌరవాధ్యక్షుడు పోలుకొండ ఏలియా భక్తసింగ్, ఉపాధ్యక్షుడు కొయ్యే నాగేశ్వరరావు, కార్యదర్శి పోలుకొండ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా రాజేష్, ఉప ప్రధాన కార్యదర్శి తెన్నేటి అలగ్జాండర్, సచివాలయ కన్వీనర్ జోగి రాజేష్, మండల ఎస్సీ సెల్ సభ్యుడు లంక చిరంజివి, పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గంలోకి ఏడుగురు సభ్యులు


వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమితులైన నాయకులు

మొగల్తూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. పార్టీ జిల్లా కార్యవర్గంలో నరసాపురం నియోజకవర్గం నుంచి ఏడుగురు సభ్యులను నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుమాని నాగరాజు, జిల్లా కార్యదర్శిగా పడవల సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఓసూరి విజ్జిబాబు, పాలా రాంబాబు, ముస్కూడి రత్నం, కడలి రాంబాబు, తిరుమాని సూర్యకళలను నియమించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళి పార్టీ విజయానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


ప్రత్యేక అలంకరణలో ఉల్లంపర్రులోని కనకదుర్గమ్మవారు

పెనుగొండ: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పెనుగొండ, ఆచంట మండలాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తెల్లవారు జాము నుంచి మహిళలు ఇళ్లల్లో లక్ష్మీదేవిని అలంకరించి నవ నైవేద్యాలు సమర్పించి, బంగారు లక్ష్మీ రూపులను ధరించి వ్రతాన్ని ఆచరించారు. ముత్తైదువులకు పసుపు, కుంకుమ, పూలు, గాజులతో వాయినాలు ఇచ్చారు. ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్ధని, వాసవి మాతలను లక్ష్మీదేవిలుగా అలంకరించి పూజలు నిర్వహించారు. అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యాన వాసవీ శాంతి ధామంలో మరకత శిలను లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆచంటలో ఆచంటేశ్వరుని ఆలయంలోనూ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పూజలు, అర్చనలు నిర్వహించారు. సిద్ధాంతంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ మాతను మహిళలు పట్టు చీరలతో అలంకరించి పూజలు చేశారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ

పాలకొల్లు అర్బన్: వరలక్ష్మీ వ్రతంలో భాగంగా ఉల్లంపర్రులో వేంచేసి యున్న శ్రీ కనకదుర్గమ్మవారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకస్వామి బాదంపూడి సాంబమూర్తి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీపార్వతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక యడ్ల బజార్ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం ఆలయంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెనుమంట్రలో ..

పెనుమంట్ర: శ్రావణ మాసం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని పెనుమంట్రలో వేంచేసి యున్న శ్రీ కనకదుర్గమ్మను వరలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

ముఖధారమ్మ ఆలయంలో పంచహారతులు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్ల పాలెం చిత్రావి చెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖధారమ్మ ఆలయంలో శుక్రవారం పంచహారతుల కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల చిన్నరాజా తెలిపారు. దాతలు బొర్రా శేషు, భువన దంపతులు అమ్మవారి పంచహారతులు నిమిత్తం ఇత్తడి కుందులు అందజేశారన్నారు. కార్యక్రమంలో చెక్కా కృష్ణ, కుంపట్ల పెద్దరాజా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటలూ ముఖ్యమే


స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న సీఐ శ్రీనివాస కుమార్

యలమంచిలి: విద్యార్థికి చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమని పాలకొల్లు రూరల్ సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్ అన్నారు. మేడపాడు గ్రామంలోని సీఎంఎస్‌లో చదువుతున్న అనాథ బాలలకు తన మిత్రుడు గార్ల మైనర్‌బాబుతో కలిసి శుక్రవారం ఆయన స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. సీఐ మాట్లాడుతూ వ్యక్తి మానసిక వికాసానికి చదువు ఎంత ముఖ్యమో, శరీర దారుఢ్యానికి ఆటలు అంతే ముఖ్యమన్నారు. పిల్లలకు సుమారు రూ.10 వేలు విలువ చేసే క్రికెట్, వాలీబాల్ కిట్లు, క్యారమ్ బోర్డులు, స్కిప్పింగ్ రోప్స్ అందజేశారు. కార్యక్రమంలో సీఎంఎస్ వార్డెన్ పడాల జ్ఞానప్రకాష్, ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్, పాలకొల్లు రూరల్ ఎస్సై ఎస్.శ్రీనివాస్, మహిళా పోలీస్ భాను తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రంగరాజుకు అభినందనలు

పెనుమంట్ర: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా తిరిగి నియమితులైన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును శుక్రవారం మార్టేరు సమన్వయ కమిటీ సభ్యులు పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. మార్టేరు 14వ వార్డు సభ్యురాలిగా ఎన్నికైన కప్పల అనంతలక్ష్మిని రంగరాజుకు పరిచయం చేశారు. మార్టేరు 1, 2 ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కర్రి అనురాధ, సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలగల నారాయణరెడ్డి, కొవ్వూరి బ్రహ్మేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు శ్రీరంగనాథరాజు ఆశీస్సులు

పెనుమంట్ర: మార్టేరు -1 ఎంపీటీసీ సభ్యుడు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల లక్ష్మణరెడ్డి కుమార్తె వివాహం ఇటీవల పెనుమంట్రలోని సాయినాథ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు లక్ష్మణరెడ్డి నివాసానికి వెళ్లి నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, విద్య మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు పాలకొల్లులో సచివాలయ కన్వీనర్ల సమావేశం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో శనివారం ఉదయం 9 గంటలకు సచివాలయ కన్వీనర్ల బీమా నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చందక సత్తిబాబు, సచివాలయ పట్టణ కన్వీనర్ ఎంఎస్ వాసు తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు ఆధార్ కార్డు, అలాగే నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలని వారు కోరారు.